

పాత వస్తువులు ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో ఇవ్వండి

ఏలూరు టౌన్‌: వాడకం లేని ప్లాస్టిక్, పాతపుస్తకాలు, దుస్తులు, చెప్పులు వంటి వస్తువులను నగరంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ కేంద్రాల్లో అప్పగించాలని, వాటిని రీసైక్లింగ్ విధానంలో తిరిగి ఉపయోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. మేరీ లైఫ్ స్వచ్ఛ్ షహర్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని అన్నివార్డుల్లో ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాతబట్టలు, ప్లాస్టిక్ బొమ్మలు వంటి ఉపయోగించిన వస్తువులను డ్యాంపింగ్ ఫీల్డ్‌లో వేయకుండా వాటిని ఈ కేంద్రాల్లో అప్పగించాలని, పర్యావరణహితంగా వాటిని తిరిగి వినియోగంలోకి తెస్తామన్నారు. నగరవ్యాప్తంగా చెత్త ఉత్పత్తిని తగ్గించడం కార్యక్రమం ప్రధానలక్ష్యమని తెలిపారు. రెడ్యూస్ ద్వారా చెత్త ఉత్పత్తిని వీలైనంతగా తగ్గించడం, రీయూజ్ ద్వారా చెత్త ఉత్పత్తికి కారణమయ్యే వస్తువులను కాలపరిమితి పూర్తయ్యేవరకూ ఉపయోగించడం, రీసైకిల్ ద్వారా వస్తువులను పునరుత్పాదన చేయడం వంటి చర్యలు ఈ కేంద్రాల ద్వారా నిర్వహిస్తామని కమిషనర్ వెల్లడించారు.

పేదల 'ఉపాధి'పై కేంద్రం దెబ్బ..!

నిబంధనలతో పనులు దూరం చేసేందుకు కుట్ర
రెండు పూటలా హాజరు విధానంతో తగ్గుతున్న కూలీల హాజరు
వేసవి అలవెన్సులు, ఇతర సౌకర్యాల నిలిపివేతతో అవస్థలు
బిజెపి తీరుపై ప్రజల ఆగ్రహం



పాలసానిపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధి హామీ చట్టంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న సరికొత్త విధానాలు, నిబంధనలు పేదల ఉపాధిని దెబ్బకొడుతున్నాయి. నిరుపేదలకు ఎంతో ఆసరాగా ఉన్న ఈ చట్టాన్ని బిజెపి నీరుగారుస్తోంది. వారిని ఉపాధి పనులకు దూరంచేస్తోంది. గత ఏడాది జిల్లాలో ఉపాధి హామీ పనుల కల్పనలో భీమడోలు మండలం ప్రథమస్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో 4.27 లక్షల పనిదినాలకుగాను 4.84 లక్షల పని దినాలను పూర్తి చేసుకుంది. ఉపాధి హామీకి అనుబంధంగా ఉన్న వివిధ శాఖలతో పాటు ఉపాధి హామీ కార్యాలయం ద్వారా 1900 పనులు చేపట్టారు. గత సంవత్సరం రూ.10.97 కోట్ల విలువగల పనులు చేపట్టడమే లక్ష్యంకాగా రూ.12.43 కోట్ల విలువగల పనులు చేశారు. ఇదే క్రమంలో గత ఆర్థిక సంవత్సరం నిర్వహించిన సామాజిక తనిఖీల్లో భీమడోలు మండలం నుంచి ఏ విధమైన రికవరీ నమోదు కాకపోవడం విశేషం. గత సంవత్సరం వరకూ ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు ఫిబ్రవరిలో 20 శాతం, మార్చి, ఏప్రిల్ నెలలకు 25 శాతం, మే నెలకు 30 శాతం, జూన్ నెలలో 20 శాతం వంతున అలవెన్స్ ఆదనంగా చెల్లించేవారు. మజ్జిగ కోసం ఐదు రూపాయలు, తాగు నీటికోసం నాలుగు రూపాయలు, పనిముట్ల కూలి రూపేణా రూ.ఐదున్నర వంతున అదనంగా చెల్లించేవారు. ఇక పనులను పర్యవేక్షించే మేట్లకు టార్పాలిన్లు, రవాణాకు రోజుకు ఒక్కక్కరికి రూ.పది, పనుల్లో పాల్గొనే కూలీలను ప్రోత్సహించేందుకుగాను ప్రతికూలీకి అదనంగా మూడు రూపాయలు చెల్లించేవారు. పని గంటలపై అంక్షలు ఉండేవి కావు. కూలీలకు రోజువారీ వేతనంగా రూ.257 వంతున చెల్లించేవారు. గత సంవత్సరం వరకూ ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం కొంత మేరకు భాగస్వామ్యం వహించేది. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ ఈ పనుల నమోదు, చెల్లింపు కార్యక్రమాలను చేపట్టేది. ఇక దూరప్రాంతాలకు వెళ్లి పనులు నిర్వహించే ఉపాధి కూలీలకు వారు ఉండే ప్రాంతం నుంచి ఐదు కిలోమీటర్లు దాటితే రూ.20 వంతున చెల్లించేవారు. ప్రస్తుతం దాన్ని రద్దు చేశారు. ఒక్కొక్క కూలి కేటాయించిన రోజు వారి కూలీ 1.60 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం షరతులో ప్రస్తుత సంవత్సరం సైతం మార్పు చోటు చేసుకోలేదు. గత సంవత్సరం తాలూకా బిల్లులు పెండింగ్ లేవని ఉపాధి హామీ కార్యాలయ అధికారులు తెలిపారు. ప్రస్తుత సంవత్సరం పరిస్థితి మారింది. ఉపాధి హామీ పర్యవేక్షణ ఎన్ఎల్‌సి అనే కంపెనీ ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. దీనికోసం ఉపాధి హామీ కూలీలు ఉదయం, సాయంత్రం కలిపి ఎనిమిది గంటల పాటు పనిచేయాలన్న షరతు విధించింది. రెండు పూటలా యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని తెలిపారు. దీనికోసం నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం యాప్‌ను ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేశారు. ఒక్కో సమయంలో సిగ్నల్ సక్రమంగా లేని కారణంగా హాజరు నమోదు కాకపోవడంతో ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న కూలి ఆ రోజు వేతనాన్ని కోల్పోవాల్సి వస్తుంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాటు చేశామని చెబుతున్నప్పటికీ అవి అంతగా అమలు కావడం లేదని ఉపాధి కూలీలు చెబుతున్నారు.

ఇక కూలీలకిచ్చే సమ్మర్, ఇతర అలవెన్సులను పూర్తిగా రద్దు చేశారు. పనుల్లో పాల్గొని నిర్ణీత కొలతల మేరకు పనులు పూర్తి చేసిన వారికి ఇచ్చే కూలీని 257 రూపాయల నుంచి రూ.272కు పెంచారు. పెరిగిన ధరలు, పని గంటలు పెరిగిన నేపథ్యంలో కూలీని రూ.600కు పెంచాలని కూలీల డిమాండ్ చేస్తున్నారు. ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని కోరుతున్నారు. ఇదే విధంగా గతంలో మాదిరి సౌకర్యాలను కల్పించాలని వేడుకుంటున్నారు. గత సంవత్సరం ఉపాధి హామీ పనుల్లో కనిపించిన ప్రగతి ఆధారంగా భీమడోలు మండలానికి ప్రస్తుత సంవత్సరం 4.48 లక్షల పని దినాల కల్పన, దీనికోసం రూ.12.14 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు అధికారులు తెలిపారు. మండలంలో 15,290 జాబ్ కార్డులు మంజూరు కాగా గత సంవత్సరం 12,286 మంది ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్నారు. వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ షరతుల మేరకు నైపుణ్య అభివృద్ధి సంస్థ ఏ విధమైన శిక్షణ ఇవ్వడం లేదని కూలీలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సంవత్సరం ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీల సంఖ్య బాగా తక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత సంవత్సరం ఉపాధి కూలీలకు రోజువారి సరాసరిన 240 రూపాయలు కూలి రాగా ప్రస్తుత సంవత్సరం రెండు పూటలా హాజరు నమోదు, తిరిగి రెండోసారి పనుల వద్దకు వెళ్లాల్సిరావడంతో పనుల్లో పాల్గొనే కూలీల సంఖ్య తగ్గుతుందని పరిశీలకులు చెబుతున్నారు. ఉపాధి హామీ చట్టం నిర్వీర్యమయ్యే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

ఈ నెల 24వ తేదీ నుండి జూన్ తొమ్మిదో తేదీ వరకు నిర్వహించే ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. ఆదివారం స్థానిక కోటదిబ్బపై తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 69 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తామని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు విద్యార్థులను అనుమతించబోరని స్పష్టం చేశారు. విద్యార్థులను ఉదయం 8:30 గంటల నుంచి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరం సాధారణ విద్యార్థులు 20,927 మంది, వృతి విద్యా విభాగంలో 1979 మంది మొత్తం 22,906 మంది పరీక్షలకు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం సాధారణ విద్యార్థులు 9297 మంది వృత్తి విద్యా విభాగంలో 2,089 మంది మొత్తం 11,386 మంది హాజరవుతారని వివరించారు. అలాగే జూన్ రెండో తేదీన మొదటి సంవత్సరం విద్యార్థులకు నైతికత-మానవత విలువలు అనే పరీక్ష ఉంటుందని, మూడో తేదీ పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యార్థులు ఏ కళాశాలలో చదువుతున్నారో ఆ కళాశాలలోనే జరుగుతాయని తెలిపారు. జూన్ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని, దీనికి జిల్లావ్యాప్తంగా ఒక్క కేంద్రం మాత్రమే ఏర్పాటు చేశారని, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే జరుగుతాయని వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా నిఘాలోనే పరీక్షలు నిర్వహిస్తామని, ఇవి ఆర్ఐఒ కార్యాలయానికి, ఇంటర్మీడియట్ బోర్డుకు అనుసంధానమై ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలన్నింటినీ సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు అందరూ వేసవి దృష్ట్యా తాగునీరు, వైద్యం, విద్యుత్ వంటి సదుపాయాలు ప్రతి పరీక్షా కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రానికి దగ్గరలో ఉన్న జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్‌లు మూసివేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఒక హైపవర్ కమిటీ నిరంతరం పరీక్షలను పర్యవేక్షిస్తాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లకు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లకు, చీఫ్ సూపరింటెండెంట్‌లకు కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు.


సమ్మర్ వెల్ఫేర్ కిట్లతో ట్రాఫిక్ సిబ్బంది

ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ వెల్ఫేర్ కిట్లు

ప్రజాశక్తి - ఏలూరు

వేసవి తాపం నుండి జిల్లా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ఏలూరు రేంజ్ డిఐజి జివిజి అశోక్ కుమార్, జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి తెలిపారు. ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ వెల్ఫేర్ కిట్లను ఏలూరు రేంజ్ కార్యాలయంలో ఆదివారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా వేసవి తాపం నుండి ట్రాఫిక్ సిబ్బంది రక్షణ పొందేందుకు వీటిని అందించామన్నారు. ఈ సమ్మర్ కిట్‌లో ఎండ తీవ్రత నుండి కాపాడే సమ్మర్ హ్యాట్స్, సన్/కూలింగ్ గ్లాసెస్, చల్లదనం ఉంచే వాటర్ బాటిళ్లు, ఒఆర్ఎస్ఎల్ ప్యాకెట్లు, అలాగే రాత్రి సమయాల్లో ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రమాదాలు జరగకుండా లైటింగ్ బ్యాట్, రేడియం రిఫ్లెక్టింగ్ సేఫ్టీ జాకెట్స్ ఉన్నాయని తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది నిత్యం మండుటెండలో విధులు నిర్వహించడం చాలా కష్టంగా ఉంటుందని, తీవ్రమైన ఎండలో దుమ్ము, ధూళి లెక్కచేయకుండా విధులు నిర్వర్తించే వారికి వేసవితాపం నుండి స్వీయ రక్షణ చాలా అవసరమని చెప్పారు. ఎండకు డీహైడ్రేషన్ కాకుండా నీరు బాగా తాగాలని, వడ దెబ్బ వంటి ప్రమాదకర పరిస్థితులకు లోను కాకుండా ఒఆర్ఎస్, నిమ్మరసం, మజ్జిగ వంటి ద్రవాలు సేవించాలని, వేసవిలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, వేసవిలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రజలకు మెరుగైన సేవలందించాలని, విధి నిర్వహణలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటూ వేసవిలో నాణ్యమైన సమ్మర్ కిట్‌ను అందించిన డిఐజి, ఎస్‌పికి జిల్లా ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బ్యూరో అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్‌పి శేఖర్, ఎఆర్ డిఎస్‌పి కృష్ణంరాజు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఏలూరు టూ టౌన్ ఎస్ఐ పి.చంద్రశేఖర్, ఏలూరు త్రీటౌన్ ఎస్ఐ వరప్రసాద్, ఏలూరు వన్ టౌన్ ఎస్ఐ రామకృష్ణ, ఏలూరు ట్రాఫిక్ ఎస్ఐ బుద్ధల శ్రీనివాసరావు, శ్రీధర్ వెంకటేశ్వరరావు, నూజివీడు ట్రాఫిక్ ఎస్ఐ రాధాకృష్ణ రెడ్డి, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

31 నుంచి మున్సిపల్ కార్మికుల ప్రచారయాత్ర

ప్రజాశక్తి - చింతలపూడి

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న ప్రచారయాత్రను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య పిలుపునిచ్చారు. చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమావేశం జి.నాగరాజు, వి.పద్మ అధ్యక్షతన సిఐటియు కార్యాలయం వద్ద జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జాన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ నుండి జూన్ తొమ్మిదో తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై జరుగుతున్న ప్రచార యాత్రలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాష్ట్రంలో 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలున్నాయని, వీటిలో సుమారు 40 వేల మందికి పైగా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ సిబ్బంది, మరో 10 వేల మందికిపైగా సిపిఎస్ ఉద్యోగులు, వెయ్యి మందికి పైగా క్లాప్ డ్రైవర్లు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సిపిఎస్ రద్దు తదితర డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారయాత్రలు కొనసాగుతాయని తెలిపారు. సిఎం జగన్ ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.


చెరువు నిండా అల్లుకున్న కలువ పూలు

కలువల కనువిందు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కలువ పువ్వులతో మండలంలోని పేరూరు తాగునీటి చెరువు కనువిందు చేస్తోంది. చెరువు నిండా తెల్లటి కలువపువ్వులతో అందరినీ ఆకర్షిస్తోంది. వేసవిలో చెరువులోని నీటి కాలుష్యాన్ని నిరోధించడంతో పాటు సూక్ష్మజీవులను కూడా నాశనం చేసేందుకు ఈ కలువపువ్వులు ఎంతో ఉపయోగపడతాయి. చూపరులకు తమ అందంతో పాటు పర్యావరణ పరిరక్షణకు, నీటి శుద్ధికి ఎంతో ప్రయోజనకారి అయినా తామర చెరువులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు సూచిస్తున్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష తగదు

ప్రజాశక్తి - భీమడోలు

ఎయిడ్స్ రోగుల పట్ల చిన్నచూపు తగదని, భీమడోలుకు చెందిన ప్రముఖ వైద్యులు, సామాజిక కార్యకర్త జి.బాబూరావు తెలిపారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఐసిటిసి కౌన్సిలర్ సిహెచ్.సింహాద్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌తో మృతిచెందిన వారికి నివాళు లర్పించారు. వారి సంస్మరణార్థం కొవ్వొత్తులతో భీమడోలు పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాబూరావు మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని కోరారు. సింహాద్రి మాట్లాడుతూ భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తమ శాఖ చేపట్టిన వివిధ కార్యక్రమాల వల్ల ప్రజల్లో చైతన్యం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ మేనేజర్ శిరీష, మానవత భీమడోలు శాఖ సభ్యులు, సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలల్లో గుండుగొలను వంతెన నిర్మాణం

రూ.3.50 కోట్లతో నిర్మాణం - పనులకు ఎంఎల్‌ఎలు వాసుబాబు, అబ్బయ్యచౌదరి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎలు వాసుబాబు, కొఠారు అబ్బయ్య చౌదరి

ప్రజాశక్తి - భీమడోలు

గోదావరి కాలువపై శిథిలావస్థకు చేరి కూలిపోయిన గుండుగొలను వద్ద వంతెనస్థానంలో అధునాతన సౌకర్యాలతో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంతెన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు, దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ వంతెన పున:నిర్మాణానికి అనుమతుల మంజూరుకు, నిధుల కేటాయింపునకు సిఎం జగన్ శరవేగంగా చర్యలు తీసుకున్నారన్నారు. నిర్మాణం త్వరగా పూర్తిచేసేందుకు సిఎం జగన్ కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి జాతీయ రహదారుల నిర్మాణంలో అగ్రగామిగా ఉన్న జిఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీకి బాధ్యతలను అప్పగించారన్నారు. దీనివల్ల దెందులూరు, భీమడోలు, ఏలూరు రూరల్ మండలంలోని పదుల సంఖ్యలో గల గ్రామాలతో పాటు కొల్లేరు ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. వందేళ్ల చరిత్ర ఉన్న గుండుగొలను వంతెన సుమారు పదేళ్లుగా శిథిలమై ప్రజలను ఇబ్బంది పెట్టిందని, గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. సిఎం జగన్ రెండు నెలల వ్యవధిలోనే అనుమతులు, నిధులు కేటాయించి మరో రెండు నెలల వ్యవధిలో వంతెన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు రవాణా సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కొఠారు అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ కొల్లేరును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధిపరిచే క్రమంలో ప్రస్తుతం నిర్మించమన్న ఈ వంతెనపాత్ర కీలకంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మకుంట భవానీరంగా, ఎంపిపి కె.రామయ్య, సర్పంచుల సంగం మండల అధ్యక్షురాలు అధ్యక్షురాలు పి.సునీతామాన్‌సింగ్, గుండుగొలను గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు, పిప్పర సుబ్బరాజు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో భారీ వర్షం



ముదినేపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలకేంద్రమైన ముదినేపల్లిలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 10 గంటలకు ఉరుములు, మెరుపులతో మొదలైన వర్షం గంటకుపైగా కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లోని కాలనీల్లోని ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు అసౌకర్యానికి లోనైయారు. ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు చేరడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇక్కట్లుపడ్డారు. పోలీస్‌స్టేషన్ బజారుతో పాటు పలు అంతర్గత రోడ్లు జలమయం కావడంతో గ్రామస్థులు ఇబ్బంది పడ్డారు. భారీ వర్షానికి వేసవి దుక్కులు చేసిన చేలల్లో భారీగా వర్షపునీరు నిలిచింది. గత రెండు వారాలుగా రికార్డుస్థాయి ఎండలతో అల్లాడిపోతున్న మండల ప్రజలు ఈ వర్షానికి ఉపశమనం పొందారు.

పోలవరం: మండలంలో ఆదివారం సాయంత్రం చిరుజల్లుల పడ్డాయి. ఉదయం నుండి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కారు మబ్బులతో జల్లులు పడ్డాయి. వాతావరణ మార్పులతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కల్లాల్లో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న పంటలపై బరకాలు కప్పి వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

జగన్ గెలుపునకు వాలంటీర్లు సహకరించాలి


వాలంటీర్లతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అత్తిలి

వాలంటీర్ల ఆశీస్సులతో మరోసారి జగన్ ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక వల్లి సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మండపంలో సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రలకు ఎంపికైన వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఎంపిపి మక్కా సుర్యానారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కాల్దారిలో ముగ్గురు రైతులను పొట్టనబెట్టుకున్న చంద్రబాబు రైతు శ్రేయస్సు కోరుకుంటున్నారంటే విస్మయం కల్గిస్తోందన్నారు. జగన్ మానస పుత్రికల్లాంటి వాలంటీర్లను అవహేళన చేయడం చంద్రబాబుకు సిగ్గుచేటని విమర్శించారు. త్వరలోనే రూ.35 కోట్లతో రేలంగి మీదుగా ఈడూరు వరకూ రెండు లైన్ల రోడ్డు నిర్మిస్తారని తెలిపారు. కరోనా సమయంలో తన నియోజకవర్గంలో కేసులు పెద్దగా నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా వ్యవహరించిన వాలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న వరిగేడుకు చెందిన వాలంటీర్ వంశీకి మంత్రి కారుమూరి రూ.15 వేలు నగదు అందజేశారు. అనంతరం వాలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గంటా విజేత, ఎఎంసి ఛైర్మన్ బుద్ధరాజు భరణిప్రసాద్, వైసిపి మండలాధ్యక్షుడు బైపే సత్యనారాయణ, జెడ్‌పిటిసి అడ్డాల జానకీ, అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సాంకేతిక విప్లవ ఘనత రాజీవ్‌గాంధీ సొంతం

వర్ధంతి సందర్భంగా ఏలూరులో భారీ ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దేశంలో సాంకేతిక విప్లవం తీసుకురావడమే కాకుండా, గ్రామాల్లో ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశంలో టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు, గ్రామ ఉపాధి అవకాశాలను ముందుకు తీసుకెళ్లే అవకాశాలున్నాయన్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం ఎంతో అవసరమని తెలిపారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. నేడు టెక్నాలజీరంగంలో విప్లవాత్మక మార్పులకు మన విద్యార్థులు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలకు ఆయనే కారణమన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక విజయవిహార్ సెంటర్‌కు చేరుకుని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు మామిడి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌడ రంగబాబు, చంద్రశేఖర్, ఉప్పు మురళీ, కృష్ణ, ఏలూరు బ్లాక్ టు కాంగ్రెస్ అధ్యక్షులు లంక రామ్మోహన్, తాళ్లూరి చక్రవర్తి, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, చంద్రకాంతమ్మ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు స్పందన యథాతథం

ప్రజాశక్తి - ఏలూరు


జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 22వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో 'స్పందన' కొనసాగుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు ధరించి సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు కేరమ్స్ పోటీలు

ప్రజాశక్తి - నిడమర్రు

నిడమర్రు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన విబిరంలో విద్యార్థులకు ఆదివారం క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాయుడు నాగభూషణం హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ పాలకులు బాలరాజు పర్యవేక్షించారు.



క్యారమ్స్ ఆడుతన్న విద్యార్థులు


ధర్మరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నేతలు

ఘనంగా ధర్మరాజు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్ ధర్మరాజు పుట్టినరోజు వేడుకలు ఆదివారం నారాయణపురంలో ఘనంగా నిర్వహించారు. గణపవరం, నిడమర్రు, మండలాల నుంచి జన సైనికులు మోటార్ సైకిల్ ర్యాలీగా వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిఎసి సభ్యులు బొమ్మిడి నాయకర్, కొవ్వూరు జనసేన నాయకులు టివి.రామారావుతో పాటు జిల్లా నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్మరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని జనసైనికులు వచ్చి బొకేలు పూలదండలతో ధర్మరాజును ముంచెత్తారు. అభిమానులు 43 కిలోల కేకును కట్ చేయించారు.


ఇళ్లపట్టాలు అందిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాసరావు

లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేత

ప్రజాశక్తి - నిడమర్రు

పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. భువనపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం 38 లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఎంఎల్ఎ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణంపై చొరవ చూపించాలన్నారు. లే అవుట్‌లో విద్యుత్, మంచినీరు, రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు విద్యుత్ మంచినీటి కుళాయి ప్రభుత్వం వెంటనే అందిస్తుందని చెప్పారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుక, సిమెంట్, కిటికీలు ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రుణ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణతో మానవ మనుగడ

ప్రజాశక్తి - మండవల్లి

పర్యావరణాన్ని, ప్రకృతిని రక్షించుకోవడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. స్థానిక గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో 14వ రోజు ఆదివారం జీవన వైవిధ్యం పర్యావరణంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను, భూములను కాపాడుకోవాలన్నారు. జిల్లాలోని చిత్తడి నేలల కొల్లేరు సరస్సును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. జీవవైవిధ్యానికి విఘాతం కలిగితే మనిషి మనుగడ సజావుగా సాగదని, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన అన్నారు. చెట్లు, పర్వతాలు, జంతువులు, అడవులు, ఎడారులు భూతాపం తెలియజేసే చిత్రాలను గీసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు షేక్ పరివిన, పాఠకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మర్ ఫిట్‌నెస్ క్యాంప్

ద్వారకాతిరుమల:ద్వారకాతిరుమల వసంత్‌నగర్ కాలనీలో ఈనెల ఐదో తేదీన ప్రారంభించిన ఎపి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏలూరు ఇండోర్ గ్రోయింగ్, ఫిజికల్ ఫిట్‌నెస్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ విజయవంతంగా కొనసాగుతుందని కోచ్ యు.విజయ్ తెలిపారు. మండలంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 50 మంది పిల్లలు శిక్షణ పొందుతున్నారని చెప్పారు.

14వ రోజుకు చేరిన వేసవి శిక్షణా శిబిరం

ముదినేపల్లి :ముదినేపల్లి, గురజ శాఖా గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఆదివారానికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించడం, తదుపరి చినపాలపర్రు ఉపాధ్యాయులు జగం బాబూరావుతో స్పోకెన్ ఇంగ్లీస్, గ్లామర్ తరగతులు నిర్వహించారు. ఆనంతరం విద్యార్థులతో ఇండోర్ గేమ్స్ ఆడించినట్లు ముదినేపల్లి, గురజ గ్రంథాలయాధికారులు ఎం.శ్రీదేవి, ఝాన్సీ తెలిపారు.


ద్వారకాతిరుమలలో వేసవి శిక్షణా శిబిరం

చిన్నపిల్లల ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి

భీమడోలు సిహెచ్‌సి చిన్నపిల్లల వైద్య నిపుణులు ఎస్.ఆల్‌ఫ్రెడ్

హలో డాక్టర్



ప్రజాశక్తి - భీమడోలు

చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణకు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.ఆల్‌ఫ్రెడ్ సూచించారు. మారుతున్న కాలం, వాతావరణ పరిస్థితులను పిల్లలకు చెందిన బాధ్యులు పరిగణలోకి తీసుకోవాలని ఆయన అన్నారు.

ప్రశ్న : ముర్రుపాల ప్రాముఖ్యత ఏమిటి?

అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లి ఇచ్చే వరం వారికి ప్రసవం జరిగిన గంట తర్వాత మూడు రోజులు వరకు ముర్రుపాలు పట్టడం అని తెలిపారు. దీనివల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఇతర అనారోగ్య సమస్యలు రావని తెలిపారు.

ప్రశ్న : పిల్లలకు వెక్కిళ్ళు, ఉబ్బరం ఉంటే ఏం చేయాలి?

పిల్లలకు వెక్కిళ్లు, ఉబ్బరం తగ్గించే క్రమంలో వారిని పడుకోబెట్టడం కన్నా 20 నిమిషాల పాటు భుజంపై వేసుకొని తిప్పితే ఉపశమనం లభిస్తుందని తెలిపారు.

ప్రశ్న : ఇటీవల కాలంలో పిల్లలను ఇబ్బంది పెట్టిన వ్యాధులు ఏమిటి?

ఇటీవల కాలంలో పిల్లలు హ్యాండ్, ఫుట్, మౌత్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీని లక్షణాలు అరికాళ్ళు, అరిచేతులు, పాదాల కింది భాగంలో నీటి పొక్కులు వస్తాయని తెలిపారు. అవి బద్దలై ఇతర ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందన్నారు. దీనికి చికెన్ పాక్స్ వ్యాధికి దగ్గర సంబంధం ఉందన్నారు. చికెన్ ఫాక్స్ వచ్చిన వారికి శరీరం మధ్య భాగం నుంచి కింద వరకు నీటి పొక్కులు వస్తాయని తెలిపారు. ఈ రెండింటి మధ్య తేడాను గమనించి తగు చికిత్స తీసుకోవాల్సి ఉందన్నారు. దీనివల్ల తినటానికి పిల్లలు ఇబ్బంది పడతారన్నారు.

ప్రశ్న : ఇటీవల కాలంలో వైరస్ వ్యాధుల తీవ్రత ఎలా ఉంది?

ఇటీవల కాలంలో కరోనా తరహాలో అడినో వైరస్ పిల్లలకు వస్తుందని తెలిపారు. 14 రోజుల పాటు ఈ వ్యాధి కొనసాగుతుందని, ప్రతి నాలుగు గంటలకు ఒక పర్యాయం జ్వర తీవ్రత పెరుగుతుంటుందని, దీనికి ఆదనంగా దగ్గు ఇబ్బంది పెడుతుందని తెలిపారు. దీని నివారణకు సిరప్ అందుబాటులో ఉందని చెప్పారు.

ప్రశ్న : ఫ్లూ వ్యాధులు పెరిగాయా?

పిల్లలకు హెచ్2ఎం3 ఫ్లూ వైరస్ ఎక్కువగా సోకుతుందన్నారు. ఇది కూడా 14 రోజుల పాటు కొనసాగుతుందని, దీని నిరోధానికి వ్యాక్సిన్ ఉందని తెలిపారు. అడినో వైరస్ నుంచి ఉపశమనానికి వైద్యుల సూచన మేరకు సిరప్ వాడాల్సి ఉంటుందన్నారు.

ప్రశ్న : పిల్లలకు వచ్చే డిహైడ్రేషన్ పరిస్థితి ఏమిటి?

వేసవిలో పిల్లలకు వాంతులు, విరోచనాలు ఎక్కువగా ఆశిస్తున్నాయన్నారు. ఎక్యూట్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్‌గా పేర్కొనే ఈ వ్యాధి మూడు, నాలుగు రోజులు కొనసాగుతుందని, వైద్యుల సూచనలను పాటించాలని తెలిపారు.

ప్రశ్న : అన్ని రకాల ఒఆర్ఎస్‌లు వాడవచ్చా?

చిన్నపిల్లలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిషేధించిన గ్రైప్ వాటర్ వాడకూడదన్నారు. దీనికి అదనంగా సంప్రదాయం పేర ఆముదం, కరక్కాయలు, వస, అనాసరకు వాడకపోవడం మెరుగని సూచించారు. వీటి వాడకం వల్ల పిల్లలు ఊపిరి అందక ఇబ్బంది పడతారని, ఒకొక్క సమయంలో చనిపోయే ప్రమాదం కూడా ఉందని తెలిపారు.

ప్రశ్న : పాలు పట్టిన వెంటనే పిల్లలను పడుకోపెట్టవచ్చా?

పాలు పట్టిన తర్వాత పిల్లలకు వెక్కిళ్లు వస్తే పిల్లలను భుజంపై వేసుకొని 20 నిమిషాల పాటు తిప్పాలని, లేకుంటే పాలు గొంతుకు అడ్డం పడి పిల్లలు ఇబ్బంది పడే అవకాశం ఉందని తెలిపారు.

ప్రశ్న : డీహైడ్రేషన్ నివారణకు మార్కెట్‌లో దొరికే అన్ని రకాల ఒఆర్ఎస్‌లు వాడవచ్చా?

ఇటీవల కాలంలో డిహైడ్రేషన్ నివారణకు వైద్యుల సిఫార్సులు లేకుండా కొందరు ఒఆర్ఎస్ వాడుతున్నారని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతి పొందిన ఒఆర్ఎస్ దావణాన్ని వినియోగించాలని, ఇవి జనరిక్ షాపుల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రశ్న : భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల సంఖ్య ఎంత?

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజు 40 మంది వరకు పిల్లలు చికిత్స కోసం వస్తున్నారని, వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడే వారిలో ఇద్దరు, ముగ్గురు ఇన్ పేషెంట్‌గా చేరుతున్నారని తెలిపారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫోటోథెరపీ, బేబీ వార్మర్ అందుబాటులో ఉన్నాయన్నారు. వీటి సహకారంతో చిన్నపిల్లలకు వైద్య సేవలు అందిస్తున్నామని, పరిస్థితి తీవ్రంగా ఉంటే ఇంతకంటే ఎక్కువ వైద్య సామగ్రి గల ఏలూరు కేంద్ర ప్రభుత్వ వైద్యశాలకు సిఫారసు చేస్తున్నామని తెలిపారు. పిల్లలు పుట్టగానే వారు ఏడిస్తే ఆరోగ్యవంతులుగా ఉన్నట్టు గుర్తించాలని సూచించారు. ఇది లేకపోతే వారిలో ఏదో రుగ్మత ఉన్నట్లుగా భావించి వైద్య నిపుణులు సూచన తీసుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఈ తరహా రుగ్మతలు, ఫిట్స్‌తో పలువురు చికిత్స కోసం వస్తున్నారని తెలిపారు.


దేశానికి సాంకేతికతను అందించిన ఘనుడు రాజీవ్‌గాంధీ

వర్థంతి సభలో వక్తలు


ప్రజాశక్తి - భీమడోలు

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 33వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం భీమడోలులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు, భీమడోలు మండలాల పరిధిగా గల కాంగ్రెస్ పార్టీ ఉంగుటూరు బ్లాక్ అధ్యక్షులు యర్రంశెట్ట ఏడుకొండలు మాట్లాడుతూ ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి ప్రస్తుతం ప్రపంచ స్థాయిలో దేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వసంతరావు, వై.దుర్గారావు, షేక్ బాజీ పాల్గొన్నారు.

కైకలూరు : తాలూకా సెంటర్లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్టా నాగరాజు గౌడ్, ఇన్‌ఛార్జి మంగిని బాబ్జి, కలిదిండి మండల అధ్యక్షుడు కెసి రెడ్డి వెంకట్ శ్రీరామ్ కృష్ణ, మండవల్లి కాశీ విశ్వనాథ్, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు మద్దిరాల సంజీవరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగుల గణపతులు, సీనియర్ నాయకులు అరిగెల వెంకటేశ్వరరావు, రవి, ప్రకాష్, హుస్సేన్ పాల్గొన్నారు.


భీమడోలులో...

జంగారెడ్డిగూడెం : స్థానిక కాంగ్రెస్ పార్టీ నేతల ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం స్థానిక మీ సేవా కేంద్రం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ప్రగలపాటి కాశీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ కొన్ని అరాచక శక్తులు ఇందిరా గాంధీ కుటుంబంపై కుట్రలు పన్నుతున్నాయన్నారు. రాజీవ్ గాంధీ భౌతికంగా లేకపోయినా ఆనాడు దేశ ప్రధానిగా భారతదేశాన్ని కమ్యూనికేషన్ రంగంలో ముందుకు నడిపించి టెక్నాలజీ, డిజిటలైజేషన్‌కు కారణమయ్యారన్నారు. భారతదేశానికి సాంకేతికత అందించిన ఘనత రాజీవ్ గాంధీకి దక్కుతుందన్నారు. పంచాయతీ మున్సిపాలిటీలకు కేంద్ర నిధులు డైరెక్టుగా వెళ్లే విధంగా చట్టం చేసి స్థానిక సంస్థలను బలోపేతం చేసిన నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ప్రగళ్లపాటి కాశీ, కార్యదర్శి వీరవల్లి సోమేశ్వరరావు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గౌత సత్యేంద్ర, మామిడి రాము, తాడేపల్లి ఉమాదేవి, కుమారి పాల్గొన్నారు.




భీమడోలులో...

నూజివీడు రూరల్:రాజీవ్ గాంధీ వర్ధంతిని స్థానిక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిడి.రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పరిమి సాగర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగ భరత్ పాల్గొన్నారు.

ఘాటెక్కిన అల్లం, వెల్లుల్లి ధరలు

ప్రజాశక్తి - పాలకొల్లు



మార్కెట్లో అల్లం, వెల్లుల్లి ధరలు ఘాటెక్కాయి. గత నెల వరకు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ రెండు నిత్యావసరాల ధరలు దారుణంగా పెరిగాయని మహిళలు ఆందోళన చెందుతున్నారు. అల్లం ధర కిలో రూ.30 నుంచి రూ.50 వరకూ పలికేది. ప్రస్తుతం దాని ధర కిలో రూ.200 నుంచి రూ.300 వరకూ పలుకుతోంది. వెల్లుల్లి కూడా కిలో రూ.40 నుంచి రూ.60 వరకూ పలుకుతోంది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కిలో రూ.120 నుంచి రూ.250 వరకూ పలుకుతోంది. ఈ రెండింటి పేస్ట్ లేనిదే మాంసాహార వంటలు తయారు కావు. పలావు, ఇతర కూరలకు ఇవి తప్పనిసరి. దీంతో మాంసాహార ప్రియులు పెరిగిన ధరలతో గగ్గోలు పెడుతున్నారు. వేసవిలో చికెన్ ధర ఎక్కువగా ఉంటుంది. దీంతో మాంసాహార ప్రియులు పెరిగిన ధరలతో గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం వివాహ వేడుకలు ఎక్కువగా జరుగుతున్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు ఎక్కువగా ఉండటంతో భోజనాల బడ్జెట్ ఎక్కువగా ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.

రెస్టారెంట్ల నిర్వాహకుల గగ్గోలు

కొంతకాలంగా పాలకొల్లులో రెస్టారెంట్ల సంఖ్య పెరిగిపోతుంది. దీంతో అమ్మకాలు తగ్గి ఖర్చులు పెరుగుతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు దారుణంగా పెరగడంతో నష్టాల ఊబిలో ఉన్నట్లు రెస్టారెంట్ల నిర్వాహకులు వాపోతున్నారు. వేసవిలో మాంసాహార వంటకాల అమ్మకాలు తగ్గాయని, దీంతో నష్టాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు.

అల్లం, వెల్లుల్లి ధరలు బాగా పెరిగాయి

కర్నేన రోజారమణి, గృహిణి, పాలకొల్లు



కొంతకాలం క్రితం వరకూ అందరికీ అందుబాటులో ఉన్న అల్లం, వెల్లుల్లి ధరలు దారుణంగా పెరిగాయి. ప్రతిరోజూ వంటింట్లో ఏదోరకంగా వీటి వాడకం తప్పనిసరి. ప్రభుత్వం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

నష్టాల్లో రెస్టారెంట్లు

చినిమిల్లి గణపతిరావు, హోటల్ యజమాని, పాలకొల్లు



పాలకొల్లు పట్టణంలో రెస్టారెంట్ల సంఖ్య పెరగడం, అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు పెరగడంతో హోటల్ పరిశ్రమ నష్టాల్లో ఉంది. ఇతర రాష్ట్రాల వంట మేస్త్రీల ధరలు దారుణంగా పెరిగాయని, దీంతో పెట్టుబడి పెరిగి.. అమ్మకాలు తగ్గి నష్టాలు ముసురుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు వాలంటీర్లకు పురస్కారాలు

నూజివీడు రూరల్: వాలంటీర్లకు ఈనెల 22వ తేదీ సోమవారం ఉగాది పురస్కారాల అందిస్తున్నట్లు ఎంపిడిఒ ఎల్.అలీఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు హాజరై వాలంటీర్లకు అవార్డులు అందిస్తారని పేర్కొన్నారు.

ఆదర్శప్రాయులు కొల్లి నాగేశ్వరరావు


ప్రజాశక్తి - చింతలపూడి

కొల్లి నాగేశ్వరరావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని రైతాంగ సమస్యలపై పోరాడాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం కొల్లి నాగేశ్వరరావు మూడో వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కంచర్ల గురవయ్య మాట్లాడుతూ కొల్లి నాగేశ్వరరావు బాల్యం నుంచి అన్యాయాలను ఎదిరించేవారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ సాగిన విశాఖ ఉక్కు ఉద్యమంలో విద్యార్థి నాయకునిగా కీలకపాత్ర వహించారన్నారు. రైతు సంఘం నాయకునిగా అనేక సేవలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి రైతు రామచంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించార. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి దంతా కృష్ణ, రైతు సంఘం నాయకులు ప్రసాద్, తాడిగడప మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు హైస్కూల్ 1982-83 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయసమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు 40 సంవత్సరాల తర్వాత సమావేశమైన పూర్వవిద్యార్థులు ఆనందంగా గడిపారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి విద్యనేర్పిన గురువులు రామ్మూర్తి, దత్తును సత్కరించారు. హైస్కూలు అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందజేసేందుకు తీర్మానించారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

శశిరేఖ కుటుంబానికి టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వేగవరం మాజీ సర్పంచి తూంపాటి శశిరేఖ కుటుంబాన్ని టిడిపి మండల కమిటీ సభ్యులు ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, ఆలపాటి దుర్గారామ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, ముళ్లపూడి శ్రీను, మాజీ సర్పంచి ఘంటా రామారావు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న నేతలు


చదరంగం ఆడుతున్న చిన్నారులు

రోటరీ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీలు ఆసక్తిగా జరిగాయి. ఆదివారం రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ, కార్యదర్శి వూడా రాంగోపాల్(గోపీ)తో కూడిన కార్యవర్గం రోటరీ యువజన విభాగం ఛైర్మన్ రాఘవరాజు ఆదివిష్ణుతో కలిసి రూపొందించిన రోటరీ యువజనోత్సవాల్లో భాగంగా రోటరీ చదరంగం పోటీలు స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. రోటరీ హ్యాపీ స్కూల్ ఛైర్మన్ అయినపర్తి చంద్రశేఖర్ పర్యవేక్షణలో పట్టణానికి చెందిన 50 మంది చిన్నారులు పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయినపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ జూనియర్స్ 20 మంది, సీనియర్స్ 30 మంది చదరంగం పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. చిన్నారుల మెదడుకు పదును పెంచే చదరంగం పోటీలు వేసవి సెలవుల్లో నిర్వహించడంపై రోటరీ దీప్తి సారించిందని తెలిపారు. విజేతలకు రోటరీ ఆధ్వర్యంలో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు ఉమర్ ఆలి, లక్ష్మి పాల్గొన్నారు.

నవ వధూవుకు ఎంఎల్ఎ డిఎన్ఆర్ ఆశీర్వాదం

ప్రజాశక్తి - మండవల్లి

నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో ఉండాలని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు నవ వధువును ఆశీర్వదించారు. మండలంలోని లింగాలలో నిర్వహిస్తున్న వివాహ వేడుకల్లో గంజాల వెంకయ్య ఆహ్వానం మేరకు ఆయన ఆదివారం పాల్గొని వివాహానికి సిద్ధమవుతున్న వధువు స్వప్నను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వివాహానికి వస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్‌కు కుటుంబీకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన రాకతో వివాహ పందిరిలో సందడి వాతావరం నెలకొంది. కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కమదన శేషతల్పారావు, పిఎసిఎస్ అధ్యక్షులు గరికిపాటి రామ్మోహన్‌రావు, శివాలయం ఛైర్మన్ రాజులపాటి యశోదనరావు, పెదస గంటి కనకాచారి, ఉప్పల ఫణి, సమ్మెట పెద్దిరాజులు, బోయిన పద్మారావు పాల్గొన్నారు.